క్లుప్తంగా

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేరిన విద్యార్థులకు మంగళవారం యూనిఫాం, పాఠ్య పుస్తకాలను హెచ్ఎం తారాబాయి పంపిణీ చేశారు. గతేడాదితో పోల్చితే 246 మంది విద్యార్థులు అధికంగా పాఠశాలలో చేరారని చెప్పారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి



పాన్‌గల్: బాల్య వివాహాలఅ నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ నరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కులు, రక్షణ చట్టాలు, బాల్య వివాహాల నిషేధం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలకు కల్పించిన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలికల విద్య, బాల్య వివాహాల నిషేధం, చైల్డ్ హెల్ప్ లైన్ టోల్‌ఫ్రీ నెంబర్లు 1096, 112, 100 అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



పాన్‌గల్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన కళ్యాణ్‌రావును మంగళవారం మండలంలోని గోప్లాపూర్, కిష్టాపూర్‌తండా, శాగాపూర్, అన్నారం, బుసిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో తమ వంతు సహకారం ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పుల్లారావు, దాస్‌నాయక్, రాజుగౌడ్, కిశోర్‌నాయక్, వాహీద్, హన్మంతునాయక్, బాలరాజ్‌యాదవ్, దేవేందర్‌నాయుడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి



వీపనగండ్ల: తమ గ్రామం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు బస్సు వసతి కల్పించాలని కోరుతూ మంగళవారం బొల్లారం గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు వనపర్తి డిపో అధికారికి వినతిపత్రం అందజేశారు. కరోనా సమయంలో తమ గ్రామానికి వస్తున్న బస్సులను నిలిపివేశారని, ఈ బస్సులను పునరుద్ధరించి మండల కేంద్రానికి అదనపు బస్సులను నడపాలని కోరారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కొల్లాపూర్, వనపర్తి డిపో అధికారులకు వినతిపత్రాలు అందజేశామని సీపీఎం నాయకులు కృష్ణయ్య, బాలగౌడ్, కృష్ణయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు, పరమేష్ అన్నారు.

ప్రజాకవి చెరబండరాజుకు ఘన నివాళి

వనపర్తిటౌన్: కలం పేరుతో దిగంబర కవులలో ఒకడిగా సుపరిచితమైన బద్దం భాస్కర్‌రెడ్డి ఆలోచనను అక్షరంగా మలిచిన విప్లవ కవి చెరబండరాజు అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం కవి చెరబండరాజు 42వ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, నాయకంటి నరసింహాశర్మ, నాయకులు గంధం నాగరాజు, బాలేమియా, బండలయ్య, వెంకటస్వామి, కర్ణాకర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఆగస్టు 15 వరకు రైతు రుణమాఫీ



ఎంపీటీసీలు, జెడ్పీటీసీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15 వరకు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ కిచ్చారెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, పూర్తి చేసిన పనుల వివరాలను ఆయాశాఖల అధికారులు సభలో వివరించారు. మండలంలో జరిగిన అభివృద్ధి, నిధుల కేటాయింపు, సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి గ్రామంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములను చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

జాబ్ క్యాలెండర్ రూపొందిస్తాం

ప్రభుత్వం నిరుద్యోగుల కోసం 2 లక్షల ఉద్యోగాల జాబ్ క్యాలెండర్‌ను రూపొందిస్తుందని, ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలను ఎలాంటి పైరవీలకు తావు లేకుండా ఆన్‌లైన్ ద్వారా చేసిన ఘనత మన కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని తన సొంత ఖర్చుతో సాగునీటి కాల్వలకు పూడిక తీత పనులు చేయిస్తున్నానని తెలిపారు. వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుందని, హద్దు దాటితే పీడీ యాక్టు తెచ్చిందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ముఖ్యమంత్రి చదువుకున్న బాలుర పాఠశాలను మోడల్ పాఠశాలగా త్వరలో రూపుదిద్దుకుంటుందన్నారు.

రింగ్ రోడ్డు మార్పు

వనపర్తి రింగ్ రోడ్డు పాత అలైన్‌మెంట్ మార్చి కొత్తగా పాలకేంద్రం నుంచి నాగవరం, వ్యవసాయ మార్కెట్, బుద్దారం రోడ్డు వరకు పొడిగిస్తామన్నారు. జులై 4 నుంచి ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీల పదవీ కాలం ముగుస్తున్నందున ప్రజలకు జవాబుదారీతనంగా అధికారులు ఉండాలన్నారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే, అధికారులు శాలువా, పూల మాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సువర్ణ, ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ సుదర్శన్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గురురాజాచారి ఉన్నారు.

పదవులు కాదు.. అభివృద్ధి శాశ్వతం



పాన్‌గల్‌లో సన్మానం పొందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో అధికారులు

పాన్‌గల్: పదవులు శాశ్వతం కాదని.. చేసిన అభివృద్ధి పనులు చిరస్థాయిగా గుర్తుంటాయని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి అన్నారు. ఈనెల 4న పదవీ విరమణ చేయనున్న ఎంపీపీ, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కోటేశ్వర్, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మండలంలో పార్టీలకతీతంగా అనేక సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో విద్య, వైద్యంతో పాటు సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ వివక్షత లేకుండా అందేవిధంగా కృషి చేశామన్నారు. ఐదేళ్ల కాలంలో మండల అభివృద్ధికి తోడ్పాటునందించిన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంపీఓ రఘురాములు, డీటీ అశోక్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వరమ్మ, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బుచ్చన్న సేవలు మరువలేనివి

మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన బుచ్చన్నను కార్యాలయం అధికారులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యాలయంలో ఎన్నో ఏళ్లుగా బుచ్చన్న అందించిన సేవలు మరువలేనివి అని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి

పాన్‌గల్: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉంటూ వాటి నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై ప్రజలను చైతన్యం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. గర్భిణులు పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు నాగరాజు, శ్రీకాంత్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ రామయ్య, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌కు సహకరించండి

వీపనగండ్ల: విద్యా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 4న రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మధుగని రామకృష్ణ అన్నారు. నీట్ లీకేజీలో బాధ్యులను గుర్తించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నవీన్, అశోక్ ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

వనపర్తిటౌన్: ఆర్టీసీలో అంతంత మాత్రంగా ఉన్న ఉద్యోగ భద్రత మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత ప్రయాణం అమలు చేస్తుండడంతో మరింత ప్రమాదంలో పడిందని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కండక్టర్లు, డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్‌లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకంతో డ్రైవర్లు, కండక్టర్లు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, అన్ని రూట్లలో శాస్త్రీయ సర్వే చేసి రన్నింగ్ టైమ్ నిర్ణయించాలన్నారు. మహాలక్ష్మి పథకంతో ఓవర్ లోడ్ కారణంగా నమోదు అవుతున్న కేసులను సానుభూతితో పరిశీలన చేయాలని కోరారు.

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి



శ్రీనివాసులును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది తప్పనిసరి అని జెడ్పీచైర్మన్ ఆర్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. వనపర్తి పట్టణానికి చెందిన చీర్ల శ్రీనివాసులు 1995లో గోపాల్‌పేట డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగం బాధ్యతలు చేపట్టి అడిషనల్ కలెక్టర్‌గా నాగర్‌కర్నూల్‌లో పదవీ విరమణ చేశారు. జెడ్పీచైర్మన్ ఆర్ లోక్‌నాథ్‌రెడ్డి, వనపర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడు బచ్చు రాము, శ్రీశైలం ఆధ్వర్యంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసులును శాలువా, పూలమాలతో సన్మానించారు. శ్రీనివాసులు 46 సార్లు రక్తదానం చేయడంతో 6 సార్లు గోల్డ్ మెడల్ సాధించారని గుర్తుచేశారు. వారి యొక్క ఆదర్శాలను తీసుకొని విద్యార్థులు మంచిగా చదువుకొని సమాజసేవలో ఆయన బాటలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో సీతారాములు, సుమిత్రమ్మ, బండారు కుమారస్వామి, విజయ్‌సాగర్, బక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి



ఆత్మకూర్: మున్సిపాలిటీల్లో అభివృద్ధిపై దృష్టి సారించడంతో పాటు అందరిని భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి చైర్‌పర్సన్ గాయత్రి, పురపాలిక మండలి సభ్యులకు సూచించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆదర్శ సురభిని ఆత్మకూర్ మున్సిపల్ పాలకమండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పుష్పగుచ్చంతో సత్కరించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్వరి, తబస్సూం, చెన్నయ్య, మండ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆపాలి



మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

పెబ్బేరు రూరల్: బొగ్గుగనుల ప్రైవేటీకరణ ఆపి, ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికి అప్పగించాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 5న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వేలం ద్వారా సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు సిద్ధమయ్యారని, ఈ ప్రభుత్వ రంగ సంస్థల కాపాడుకునేందుకు ముందుకు రావాలలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోష, రమేష్, గోపాలకృష్ణ, మండ్ల రాజు, రమేష్ పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య



విద్యుత్ లైన్లు సరిచేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

అమరచింత: మదనాపురం మండలంలోని రామన్‌పాడ్ జలాశయం సమీపంలోని ఎర్రగట్టు వద్ద ఏర్పాటు చేసిన ఎర్రగట్టు మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా కొనసాగింది. వీటితో పాటు అమరచింత పట్టణంలో విద్యుత్ సమస్యతో సోర్స్‌బోర్లు సైతం పనిచేయకపోవడం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మిషన్ భగీరథ ఏఈ రామకృష్ణ ఎర్రగట్టు పంప్‌హౌజ్‌కు సోమవారం రాత్రి నుంచే విద్యుత్ సరఫరా జరిగేలా ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడటంతో తాగునీటి పంపింగ్ కొనసాగింది. అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, చిన్నచింతకుంట మండలాల్లోని సుమారు 26 గ్రామాలకు మంగళవారం తాగునీరు అందించారు. అమరచింత మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం ఆదేశాలతో మున్సిపల్ ఎలక్ట్రిషన్ సిబ్బంది సోర్సుబోర్లకు త్రీఫేజ్ కరెంట్ పునరుద్ధరించడంతో పట్టణంలోని 1, 8 వార్డుల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పాయి.

'రైతు నేస్తం'పై వీడియో కాన్ఫరెన్స్

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు ఏడీఏ చంద్రశేఖర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతుభరోసా మీద వస్తున్న అపోహలను నివృత్తి చేశారు. కరీంనగర్ జిల్లా రైతు మల్లికార్జున్‌రెడ్డితో సమగ్ర వ్యవసాయ విధానంలో సేంద్రియ ఎరువుల వాడకం, కోళ్ల పెంపకం, కూరగాయలు, పూలు తదితర పంటల సాగు, పొందుతున్న ఆదాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, వర్షాధారిత పంటలైన మొక్కజొన్న, కంది, పత్తి పంటల విత్తన సమయం, యాజమాన్య పద్ధతుల గురించి పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఓ సాజీద్ రహమాన్, ఏఈఓలు శైలజ, మహేశ్వరీ, నరేష్, అఖిల, నరేష్, రైతులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన వేగవంతం

ఆత్మకూర్: ధరణిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, దరకాస్తులను వేగంగా పరిశీలిస్తున్నామని తహసీల్దార్ రాజు అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించిన అనంతరం దరకాస్తుల పరిశీలనను పర్యవేక్షించారు. భూ సమస్యలు, తప్పొప్పులు, ఇతరాత్ర దరకాస్తులన్నింటినీ పరిశీలించి కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. మొత్తం 225 దరకాస్తులు రాగా ఇప్పటి వరకు 143 దరకాస్తును పరిశీలించి కలెక్టర్ కార్యాలయానికి పంపించామన్నారు. మిగిలిన 82 దరకాస్తుల పరిశీలన మూడు రోజుల్లోగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ జయమ్మ, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది నయ్యూం, చందు, రఘు, హరీష్, రాము, పరశురాము, సంపత్, నారాయణ తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: కలెక్టర్ ఆదేశానుసారం మండల తహసీల్దార్ కార్యాలయం అధికారులు మంగళవారం ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మొత్తం 226 దరఖాస్తులు రాగా.. మూడు రోజుల నుంచి 45 దరఖాస్తుల సమస్యలను పరిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. మండల స్థాయిలో తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామని, తమ పరిధిలో లేని సమస్యలను జిల్లా అధికారులకు నివేదిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌నాయుడు, ఆర్ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యసేవలు అందించడం అదృష్టం

వీపనగండ్ల: ప్రమాదకర పరిస్థితిలో ఉన్నవారికి వైద్య సేవలు అందించే అవకాశాన్ని అదృష్టంగా భావించాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్ఎస్‌గా పనిచేసిన నాగరత్నమ్మ ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల కోఆర్డినేటర్ చైతన్యగౌడ్, వైద్యాధికారిని ప్రియాంక, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ వంశీకృష్ణ, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు రాజశేఖర్, శబరి తదితరులు పాల్గొన్నారు.



జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని వినతి

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని బీజేపీ, యువ మోర్చా ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్టు రాజశేఖర్ మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించినట్లుగా 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని నియామకాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్, గ్రూప్స్ పరీక్షల్లో అదనంగా పోస్టులు పెంచాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బంగారు రవి, బూత్ అధ్యక్షుడు నాగరాజు, బాలవర్ధన్, నర్సింగాపూర్ మహేష్, అగ్రహారం రాము, శివ, కురువ విష్ణు పాల్గొన్నారు.

సమాజసేవకు విరమణ లేదు



మాట్లాడుతున్న ఎంపీపీ సోమేశ్వరమ్మ

చిన్నంబావి: పదవికే విరమణ అని, ప్రజాసేవకు కాదని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సోమేశ్వరమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా పార్టీల కతీతంగా ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు గ్రామాల అభివృద్ధికి, ప్రజాహితం కోసం పని చేశారన్నారు. జులై 4 నుంచి వారి పదవీ కాలం ముగిసినా.. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనపై అధికారులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఎంపీటీసీలు గ్రామాల్లో కేవలం ఉత్సవ విగ్రహలుగా మిగిలిపోయారని ఆరోపించారు. ఎంపీటీసీలకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో గ్రామాలను సొంత ఖర్చులతో అభివృద్ధి చేశారన్నారు. చిన్నంబావి మండలంలో ఐదేళ్లుగా అనేక రకాలుగా అభివృద్ధి చేశారని ఎంపీపీ, జెడ్పీటీసీని అభినందించారు. గ్రామాల అభివృద్ధిలో అధికారులు ప్రజాప్రతినిధులకు పూర్తి స్థాయిలో సహకారం అందించారని, ఇదేవిధంగా భవిష్యత్‌లో కూడా కొనసాగాలని కోరారు.

పదవులు శాశ్వతం కాదు

రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని, అధికారులు ఎవరు అధికారంలో ఉంటే వారికి వత్తాసు పాడకుండా న్యాయంగా ప్రజా సేవ చేసి అభివృద్ధికి బాటలు వేయాలని ఎంపీపీ సోమేశ్వరమ్మ అన్నారు. మహిళగా ఉన్నప్పటికీ తనకు అధికారుల నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందడంతో చిన్నంబావి మండలాన్ని అభివృద్ధి చేశానన్నారు. అనంతరం అన్ని గ్రామాల ఎంపీటీసీలు, జెడ్పీటీసీని అధికారులు, బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్రామమ్మ, సింగిల్‌విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, ఎంపీడీఓ రమణరావు, వైస్ ఎంపీపీ పుష్పలత, ఎంపీటీసీలు మహాదేవ్‌గౌడ్, తగరం లక్ష్మి, పుష్పావతి, మౌళాలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'రైతుభరోసా'పై అభిప్రాయ సేకరణ



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న కృష్ణమూర్తి



తూంకుంట మాట్లాడుతున్న డీసీఓ ప్రసాద్‌రావు

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా పథకంపై రైతులతో అభిప్రాయాలను సేకరిస్తున్నామని పీఏసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, జిల్లా డీసీఓ సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నరేందర్ అన్నారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లు, రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇది వరకు చాలా మంది గ్రామకంఠం, నాన్‌అగ్రికల్చర్, రోడ్లు, సాగులేని గుట్టలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్ఆర్ఐలు, ప్రభుత్వానికి పన్నులు చెల్లించేవారు, ప్రజాప్రతినిధులు కూడా రైతుబంధు తీసుకున్నారని దుయ్యబట్టారు. అలాంటి వారికి కాకుండా శిస్తు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని పలువురు రైతులు సూచించారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్, ఏఈఓ మహేశ్వరి, సీఈఓ నరేష్, అధికారులు మాసన్న, సురేష్, డైరక్టర్లు సహదేవుడు, తమ్మిరెడ్డి, రాములు, రైతులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: రైతుభరోసా పథకం కొనసాగింపుపై మంగళవారం తూంకుంట ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని రైతు వేదికలో రైతులతో అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ ప్రసాద్‌రావు మాట్లాడుతూ రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, వైస్ చైర్మన్ సరితా, సీఈఓ రాము పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



మదనాపురంలో మహిళా సమైఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అమడబాకులలో రూ.8 లక్షలతో నిర్మించిన గొడ కమ్యూనిటీ హాల్, రూ.8.50 లక్షలతో నిర్మించిన కుమ్మరి కమ్యూనిటీ హాల్‌ను జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనికతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా రూ.5 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్ర భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేరుస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో పూర్తి చేస్తామన్నారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నామని.. కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. మోడల్ స్కూల్‌కు వెళ్లి ప్రిన్సిపల్ శ్రీనివాసాచారితో కలిసి విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు పి.ప్రశాంత్, బోయేజ్, సత్యారెడ్డి, రంగారెడ్డి, సతీష్‌గౌడ్, కిష్టారెడ్డి, మోహన్‌గౌడ్, ఉమామహేశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అబ్దుల్లా, బోయ బాలరాజు, విజయ్‌రెడ్డి, మన్యం, రామస్వామి, తిరుపతయ్య, వెంకటయ్య, కొల్లంపల్లి, బాషా, మేస్త్రీ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి..

మదనాపురం: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని.. రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా చేయూతనిస్తుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన మండల మహిళా సమైఖ్య భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చి మహిళలకు ప్రత్యేక శిక్షణనిచ్చి కొత్త కొత్త వస్తువులు తయారు చేయించి హైదరాబాద్ తదితర పట్టణాల్లో విక్రయించుకునేలా స్టాల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు శాలువాతో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, మండలపార్టీ అధ్యక్షుడు నాగన్న, మహిళా అధ్యక్షురాలు రేణుక, ఏపీఎం కృష్ణవేణి, నాయకులు జగదీష్, కృష్ణ, అక్కల మహదేవన్‌గౌడ్, టీసీ నాగన్న యాదవ్, వెంకట్ నారాయణ, రవీందర్‌రెడ్డి, మహేష్, రామకృష్ణ, ఆవుల రాఘవేందర్, సాయిబాబా, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పదవులు దేవుడిచ్చిన వరం..

పదవులు దేవుడిచ్చిన వరమని.. పదవిలో ఉన్నప్పుడే ప్రజలకు సేవచేసి పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగియడంతో మంగళవారం మండలంలోని దంతనూరు కల్యాణ మండపంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని వారిని సన్మానించి మాట్లాడారు. అందరూ కలిసికట్టుగా ఉండి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను ఎంపీటీసీలు, ఎంపీపీ పద్మావతి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.